# మృత్యువు హాస్యప్రియత్వం

*- అజంతా*

ఒక పద్యం రాయడానికి ఒక జీవితం
చాలా కాలం తర్వాత

ఇటీవల
అద్దంలో ఒకసారి నా ముఖం చూసుకున్నాను
ఎక్కడా అపశ్రుతి లేదు
అపభ్రంశం లేదు, అదే ముఖం, అదే ప్రతిబింబం
కాని ఒక్కటే తేడా
ఆ ముఖంలో నేను లేను
ఉన్నానో లేదో ఖచ్చితంగా చెప్పలేకపోతున్నాను

పద్యం ప్రారంభమైనట్టే
మళ్ళీ నన్ను నేను సృష్టించుకుంటున్నాను
నా మీద నేనే యుద్ధం ప్రకటిస్తున్నాను
గాయపడకుండా ఉన్న చోటు అంగుళమైనా లేదు నా శరీరంలో;
నా నీడ సైతం రక్తసిక్తమైనదే
ఒక పద్యం తర్వాత మరో పద్యం
మరో జీవితం,
నేనెందుకు జీవిస్తున్నాననే ప్రశ్న
ఎన్నటికీ నన్ను భయపెట్టదు

కొత్తపద్యానికి నిర్భయంగా తలుపులు తెరిచాను,
పద్య శరీరం మీద వెల్తురు విజృంభించడానికి వీలుగా
గది మధ్యలో ప్రత్యేకంగా ఒక సూర్యకిరణాన్ని ప్రతిష్ఠించాను కూడా

ఇక
పద్యం ప్రారంభిస్తున్నాను
ప్రారంభంలో
యథావి   ఒక అస్పష్టవాక్యం
అడవిలో వెన్నెల అగ్ని వర్షిస్తున్నదని అంటున్నారు,
నిజమేనా?
పృచ్ఛకుడెవరో ఫలానా అని చెప్పలేను
బ్రతుకంతా నన్ను వెంటాడుతున్న అపరిచితుడెవరో
బహుశా అతడే కావచ్చు

మరో అస్పష్టవాక్యం
ఆకాశంలో మేఘాలు ఎప్పుడూ ఎలా ప్రవర్తిస్తాయో చెప్పడం
చాలా కష్టం
మనిషి కూడా అంతే
సూర్యుడు అసాధారణంగా ఉన్న ఒక రోజున
ఇద్దరు యువకులు నడివీధిలో నిల్చుని
తుపాకులు మాట్లాడే భాషలో కాలస్వరూపాన్ని
అభివర్ణిస్తున్నారు

క్షణం తర్వాత
సమీపంలో ఉన్న ఒక మహావృక్షం అక్కడ లేదు
వీధి పొడుగునా ఉన్న దీపస్తంభాలు కూడా అక్కడ లేవు
మృత్యువు ఎంత భయంకరంగా నవ్వుతుందో ప్రత్యక్షంగా
అప్పుడు నేను చూశాను

ఇక సరాసరి పద్యం వెన్నెముకపై అడుగు పెడుతున్నాను
ఇతివృత్తం నేనే కనుక దైనందిన జీవితం నుంచి సూచనప్రాయంగా
ఒక ఘట్టాన్ని ఇక్కడ పరిచయం చేస్తున్నాను
పద్యానికి ఆత్మ అదే
వీధిగుమ్మానికి నమస్కారం చేస్తేనేగానీ

రోడ్డు మీద అడుగుపెట్టడం ఇష్టం ఉండదు నాకు

అంతరార్థం: మళ్ళీ క్షేమంగా ఇల్లు చేరుకోవాలని కాదు,
బహుశా ఇదే కడసారి కావచ్చునేమో అని

వెళ్ళబోయే ముందు ఇంట్లో నా వైపు ఆప్యాయంగా చూసే ప్రతి వస్తువులో,
భార్య పిల్లలు బంధుమిత్రులు సరే-
ప్రాణంతో ఉన్న ప్రతి వస్తువులో
అశరీరంగా ఒకసారి ప్రవేశిస్తాను
ముఖ్యంగా వీధి వసారాలో నేను కూర్చునే కుర్చీని
నిర్లిప్తంగా ఒకసారి స్పృశిస్తాను.
అంతే,
ఆ తర్వాత మరేం లేదు
మనిషి ఉన్నంతవరకే ఏదైనా అంతా ఒక మంచుతెర
మర్నాడు ఆ కుర్చీ అక్కడ ఉండదు-
ఎవరో కాళ్ళతో తొక్కేస్తారు
అంతే మనిషి ఉన్నంత వరకే ఏదైనా

మధ్యలో ఇక్కడ ఒక క్షణం విరామం
అపశబ్దాలు, అప్రస్తుత ప్రసంగం

నిష్క్రమణపత్రాలపై మృత్యువు సంతకం స్పష్టంగా కనపడదట
విడుదల పత్రం అనడం సముచితంగా ఉంటుందేమో!
విడుదల శరీరం నుంచి కావచ్చు,
శరీరప్రాకారంలో చెలరేగుతున్న చీకటి నుంచి కావచ్చు
లేదా మృత్యువు నుంచే కావచ్చు

ఒక క్షణం తొట్రుపాటు తత్తరపాటు
మృత్యువు నవ్వకుండా ఉంటుందా?

శరీరాన్ని గణవిభజన చేసుకుని
ఒకేసారి
ఒకే రూపంలో
విభిన్నగణాంకాలలో బ్రతుకుతున్న మనిషిని నేను
నన్ను నేను ఏనాడో బహిష్కరించుకున్నాను
నేను సృష్టించుకున్న చెరసాలలో సంకెళ్ళు తెంచుకుంటున్న
ఖైదీని నేనే
ఒక జీవితం నుంచి మరొక జీవితంలో అడుగుపెడుతున్నాను
మరో శరీరంలో ప్రవేశిస్తున్నాను
సంఘర్షణ తప్పదు
ఆకలిజ్వాలలను కన్నీళ్ళతో
ఆర్పగలననుకునేవాడు ముమ్మాటికీ విద్రోహి
సోఫాలో కూర్చొని రివాల్వర్ గురిపెడుతున్న
విప్లవప్రవక్త మహావంచకుడు
పోరాటం తప్పదు
జీవనబీభత్సాన్నే ఆయుధంగా చేపడుతున్నాను నేను
నా శరీరం అదే
ఆత్మ అదే
దుఃఖం
దుఃఖాగ్ని
దుఃఖవ్యామోహం
దుఃఖవివశత్వం
ఇత్యాది ఘరానా శబ్దాలకు ఈ పద్యంలో స్థానం లేదు
అనుకరణ దుఃఖం చెల్లనే చెల్లదు

దిగుమతి చేసుకుంటున్న యురోపియన్ దుఃఖం
పూర్తిగా నిషిద్ధం
అంతా దుఃఖితులే
అన్నీ దుఃఖంలో నుంచే

ఇక వేరే దుఃఖం ఎక్కడ
వ్యవధిలేదు
ఇక పద్యం పూర్తిచేస్తాను
కవిత్వం వేరే ఎక్కడో లేదు
నిస్సహాయుడు నిరాయుధుడైన ఒక గిరిజనుడు లేదా
ఒక దళితుడు మాట్లాడేదంతా కవిత్వమే
తెలంగాణాలో ఒక గ్రామం చాలు
లేదా మన్యప్రాంతంలో ఒక గ్రామం నా మరో జీవితం
అక్కడే అని ఆశ

వచ్చిన దోవ శాశ్వతంగా మూసేస్తున్నాను
శరీరంతో నిమిత్తం లేకుండానే –

విచారం లేదు
వీధిమొగలో మళ్ళీ నా ఎదుట నేనే కదా
మృత్యువు నవ్వు మరొకసారి మళ్ళీ ఇక్కడ విన్నాను
బ్రతుకులో ఇది బహుశా మరొక ఆటవిడుపు కావచ్చు

ఇప్పుడు నా ఎదురుగా ఉన్న అభేద్యమైన ఒక గోడ
గోడ దాటగలనా నేను
మనిషిని యుద్ధసన్నద్ధం చేసే భాషాసామగ్రి లభ్యమయ్యే
చోటు అక్కడే
గోడ దాటగలనా నేను

నెత్తురు ధారలలో గానీ సాధ్యం కాదేమో
పద్యం ఇక సాగదు
అవసరం లేదు కూడా
పద్యాంతంలో మరో అస్పష్టవాక్యాన్ని వేదికపై నిలబెడుతున్నాను
తెల్లని కాగితం మీద తెల్లని అక్షరాలు
జనన మరణ రహస్యం

బహుశా అక్కడ నిక్షిప్తమై ఉన్నదేమో
నిగూఢార్థం అదే కావచ్చు
అంతే
ఇక మరేం లేదు
మనిషి ఉన్నంతవరకే ఏదైనా
ఏదైనా
ఏదైనా.